గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం
జిల్లాలో సోమవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

పాల్వంచలో కొలువుదీర్చేందుకు తీసుకొచ్చిన గణపతి ప్రతిమ



న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణపుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలోని మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి స్వామివారిని పల్లకీ సేవగా చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు స్వామివార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్ ద్వారా తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, తలనీలాలు, చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు, సారెలను సమర్పించారు. పూజాది కార్యక్రమాల్లో ఈఓ ఎన్.రజనీకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, డైరెక్టర్లు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, వెంకటరామారావు పాల్గొన్నారు.

29న చండీ హోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 29న చండీ హోమపూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూజలో పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 98669 23261, 63034 08458 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేటి గిరిజన దర్బార్ రద్దు

భద్రాచలం: వినాయక చవితి సందర్భంగా సోమవారం సెలవు ప్రకటించిన నేపథ్యాన భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రతీ వారం నిర్వహించే గిరిజన దర్బార్‌ను రద్దు చేశారు. ఈ విషయాన్ని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ప్రజలు గమనించాలని కోరారు.

అన్నింట్లో అగ్రగామిగా..





జాతీయ పతాకానికి వందనం చేస్తున్న విప్ కాంతారావు, ఎమ్మెల్యే వనమా, కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ వినీత్ (ఇన్‌సెట్) ప్రసంగిస్తున్న విప్

దేశ జాగృతి, అభ్యున్నతికి పాటుపడదాం

- తెలంగాణ జాతీయ సమైక్యతా వేడుకల్లో విప్ రేగా

సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్ని రంగాల్లో స్వరాష్ట్రం అగ్రగామిగా పురోగమిస్తోందని, దేశ జాగృతి, అభ్యున్నతి కోసం మన వంతు కృషి చేద్దామని రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పేర్కొన్నారు. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పతాకవందనం చేసి మాట్లాడారు. 1948, సెప్టెంబర్ 17న తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారి, రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దశలోకి పరివర్తన చెందిందని అన్నారు. ఇటీవలే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను 21 రోజులపాటు నిర్వహించామన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం కోసం, స్వరాష్ట్ర కాంక్షతో నిర్వహించిన ఉద్యమాలను, మహనీయుల త్యాగాలను గుర్తుచేశారు. 2001లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమశంఖం పూరించి, 14 ఏళ్ల అవిశ్రాంత పోరాటం చేశారని పేర్కొన్నారు. ఉద్యమం తీవ్రతరం కావడంతో ఢిల్లీ ప్రభుత్వం దిగొచ్చిందని, 2014, జూన్ 2న స్వరాష్ట్ర స్వప్నం సాకారమైందని తెలిపారు. నేడు రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగమిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి ఆవరించి ఉన్న చిమ్మ చీకట్లను చీల్చుకుంటూ దేశానికి దారి చూపించే టార్చ్‌బేరర్‌గా నిలిచిందని అన్నారు. విద్యుత్, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, ప్రజాసంక్షేమం, పారిశ్రామిక, ఐటీ రంగాల్లో అనతికాలంలోనే అద్భుతాలు ఆవిష్కరించిందని తెలిపారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రగతిశీల, పారదర్శక విధానాల వల్ల రాష్ట్ర సంపద గణనీయంగా పెరిగిందన్నారు. సంపదను పెంచాలి, పేదలకు పంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. అనేక రకాల సంక్షేమ పథకాల ద్వారా ప్రతి సంవత్సరం 50 వేల కోట్ల రూపాయలకు పైగా చెల్లిస్తోందని చెప్పారు. సమష్టి కృషితో బంగారు తెలంగాణను సాకారం చేసుకుందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అటవీశాఖాధికారి కృష్ణగౌడ్, అదనపు కలెక్టర్ రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్, కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కాగా జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య వేడుకలకు హాజరుకాలేదు. వేడుక అనంతరం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో తేనీటి విందు ఏర్పాటు చేశారు. అధికారులతోపాటు ప్రజాప్రతినిధుల అనుచరగణం కూడా కాన్ఫరెన్స్ హాల్‌లోకి రావడానికి పోటీపడడంతో తోపులాట జరిగింది.

విశ్వ బ్రాహ్మణులకు పెద్దపీట

విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విప్ రేగా కాంతారావు అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ సకల వేదాలు విశ్వకర్మే సృష్టికర్త అని పేర్కొంటున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ డాక్టర్ వినీత్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు కాపర్తి వెంకటాచారి, పోలోజు సత్యనారాణచారి, పోలోజు రాజేశ్వరి దంపతులు, నామోజు గోవిందాచారి, వారాధి సత్యనారాయణ, తూము కృష్ణమాచారి, యలగందుల రామాచారి, సీహెచ్ ముసలయ్య, ముదురుకోళ్ల కిషోర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ వినాయక చవితి శుభాకాంక్షలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాలతో పూజలు జరుపుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి విఘ్నాలు లేకుండా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు.

ఓటరు నమోదుకు రేపటివరకే గడువు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నూతన ఓటర్లుగా నమోదు, జాబితాలో చేర్పులు, మార్పులు, అభ్యంతరాల కోసం దరఖాస్తు గడువు ఈ నెల 19వ తేదీతో ముగియనుందని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. గత ఆగస్టు 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించామని పేర్కొన్నారు. చిరునామా మార్పు, నూతన ఓటరు నమోదు, మరణించిన ఓటర్ల తొలగింపునకు కుటుంబ సభ్యులకు ఫారం–7 ద్వారా నోటీసుల జారీ చేయాలని సూచించారు. అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని తెలిపారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువత నూత న ఓటరుగా నమోదు కావాలని సూచించారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ఎస్డీఎల్‌సీఈలో బీఏ, బీకాం, ఎంఏ, ఎంకాం తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈమేరకు ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి.గోపి ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఇంటర్, తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు డిగ్రీలో ప్రవేశం పొందొచ్చని తెలిపారు. అలాగే, డిగ్రీ పూర్తిచేసిన వారు ఎంఏ, ఎంకాం తదితర కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 25 వ తేదీలోగా స్థానిక అధ్యయన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99085 70890, 98492 50633 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మా బొజ్జ గణపయ్య..

- పూజలకు సిద్ధమైన గణనాథులు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి
- నేడు కొలువుదీరనున్న వినాయకుడు



సూపర్‌బజార్‌లో పూలు కొనుగోలు చేస్తున్న భక్తులు

కొత్తగూడెంటౌన్: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఊరువాడ సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా ఉత్సవ కమిటీలు వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశాయి. సోమవారం నుంచి వినాయక నవరాత్రి మహోత్సవాలు జరగనుండగా, గ్రామాలు, బస్తీల్లో యువకులు ఇప్పటికే మండపాలు సిద్ధం చేశారు. నేడు గణపతి ప్రతిమలను కొలువుదీర్చనున్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. పట్టణంలోని సూపర్‌బజార్, గణేష్‌టెంపుల్, రామవరం, రుద్రంపూర్, త్రీఇంక్లైన్, మెయిన్ హాస్పిటల్ ఏరియా, గాజులరాజంబస్తీ, బాబుక్యాంప్, బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, రామటాకీస్ ఏరియా, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి తదితర ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేశారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 150కు పైగా మండపాలకు అనుమతులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంకా కొందరు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. సోమవారం నుంచి ప్రతి వీధిలో గణనాథుడికి పూజలు నిర్వహించనున్నారు. కాగా గణేష్ మండపాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. సౌండ్ సిస్టం రాత్రి 10 గంటల వరకు ఉపయోగించాలని పేర్కొంటున్నారు. ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

పూలకు గిరాకీ

వినాయక నవరాత్రుల ఉత్సవాల నేపథ్యంలో పూలకు గిరాకీ పెరిగింది. ఆదివారం మార్కెట్‌లో సందడి కనిపించింది. కిలో చామంతి పూలు రూ.800, మల్లెపూలు మూర రూ.100, పత్రి, ఎలక్కాయలతో పాటు తమలపాకులు కలిపి రూ.100, నాలుగు తంగేడు పూల కట్టలు 100, సన్నజాజి మూర రూ.50, నాలుగు గునుగు, తామర పువ్వు ఒక్కటి రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. చిరు వ్యాపారులు స్థానిక అటవీ ప్రాంతాల్లో గునుగు, తంగేడు పూలు సేకరించి అమ్ముతున్నారు.

పత్రాలు, పూజా సామగ్రి విక్రయాలు



పత్రాలు, వెలక్కాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

పాల్వంచరూరల్: వినాయకుడిని పవిత్రమైన 21 రకాల పత్రాలతో పూజిస్తారు. ప్రకృతి ప్రసాదించిన గరక, మాచీపత్రం, బిల్వపత్రం, చత్తూర, బృహతిపత్రం, తులసి, జాజి, అర్జున, సింధూర, శమీ, కరవీర, అశ్వత్థ, మరువక, విష్ణుకాంత, దేవనారు, తామర, బదిరీ, ఆర్క, దాడిమి తదితర పత్రాలను భక్తులు ఆదివారం కొనుగోలు చేశారు. పత్రాలను గతేడాది రూ. 100 వరకు విక్రయించగా, ప్రస్తుతం రూ.150 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారని భక్తులు తెలిపారు.

33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..



ఇల్లెందు పట్టణంలో సాగుతున్న ర్యాలీ

- చట్టసభల్లో మహిళలకు అవకాశం కల్పించాలి
- ఇల్లెందు ర్యాలీలో ఎమ్మెల్యే హరిప్రియ



ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుతో పాటు బీసీ జనగణన బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించాలని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇల్లెందు జేకే కాలనీలోని క్యాంపు కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి, అంబేడ్కర్, కొమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హరిప్రియ మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే, దేశవ్యాప్తంగా బీసీ జనగణన జరిగే బిల్లును కూడా సోమవారం నుంచి మొదలయ్యే పార్లమెంట్ సమావేశాలలో ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సాగిస్తున్న పోరాటానికి మద్దతుగా మహిళాలోకం ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ర్యాలీలో జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, వార్డు కౌన్సిలర్లు కటకం పద్మావతి, కడకంచి పద్మ, చీమల సుజాత, గిన్నారపు రజిత, వాంకుడోత్ తార, జేకే శ్రీనివాస్, వారా రవి, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజంతో పాటు నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత, మంజుల, చంద్రావతి, భాగ్య, నారాయణమ్మ, మదార్‌బీ, నాదెండ్ల శ్రీనివాసరెడ్డి, మనోహర్ తివారీ, గిన్నారపు రాజేశ్, మేకల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే ద్రోహులుగా మిగులుతారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

భద్రాచలంఅర్బన్: వీర తెలంగాణ సాయుధ పోరాట వాస్తవ చరిత్రను వక్రీకరించే వారు చరిత్ర ద్రోహులుగా మిగులుతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల్లో ఆదివారం భద్రాచలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వీరభద్రం మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు వాస్తవ చరిత్ర తెలియజేయాలనే ఉద్దేశం ఉంటే తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను కమ్యూనిస్టు త్యాగాలకు గుర్తుగా చెప్పాలని సూచించారు. ఈ విషయాన్ని చెప్పే ధైర్యం లేకపోవడంతోనే వాస్తవ చరిత్ర ప్రజలకు తెలియకుండా కుట్రలు పన్నారని ఆరోపించారు. ఈ నేపథ్యాన అసలైన చరిత్రను వారసులుగా వివరించాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. భూమి, భుక్తితో పాటు వెట్టి విముక్తి కోసం సాగిన మహత్తర పోరాటంలో 4 వేల కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలర్పించారని గుర్తుచేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, కాసాని ఐలయ్య, రవికుమార్, ఏజే రమేశ్, కొక్కెరపాటి పుల్లయ్య, ఎంబీ నర్సారెడ్డి, కె.బ్రహ్మాచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆపన్నహస్తం అందించండి

దీనగాథ



చికిత్స పొందుతున్న జెట్టి సుశీల

అశ్వాపురం: మండలంలోని చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన జెట్టి సుశీల మెదడులో నరాలు చిట్లి రక్తస్రావం జరిగి ఖమ్మం స్పర్శ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 20 రోజుల కిందట తన కుమారుడు (25) డెంగీ జ్వరంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె ఆరోగ్య పరిస్థితి దెబ్బతిన్నది. రెక్కాడితే కాని డొక్కాడ ని నిరుపేద కుటుంబం. వైద్యానికి ఇప్పటి వరకు అప్పుచేసి భర్త యోహాను రూ.రెండు లక్షల వరకు ఖర్చు పెట్టాడు. భార్యను ఎలాగైన బతికించుకోవాలని భర్త యోహాను నానా తంటాలు పడుతున్నాడు. పెద్ద మనస్సు చేసుకొని దాతలు, పెద్దలు, ప్రజాప్రతినిధులు తమవంతు సహాయం చేసి తన భార్యను బతికించాలని యోహాను వేడుకుంటున్నాడు. సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే, గూగుల్ పే నంబర్ 96039 99359ను సంప్రదించాలని ఆయన కోరారు.

బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక



బాల్‌బ్యాడ్మింటన్ జిల్లా జట్టు

బోనకల్: సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టును ఆదివారం ఎంపిక చేశారు. బోనకల్‌లో జరిగిన ఎంపిక పోటీలకు వంద మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేసినట్లు బి.రమేష్, జె.శివకృష్ణ తెలిపారు. పీఈటీలు సంధ్యారాణి, దుర్గా, నాగమణి, త్రివేణి, జాతీయ క్రీడాకారులు సీహెచ్.శ్రీధర్, బి.గోపి పాల్గొన్నారు.

ఇల్లెందు డిపో నుంచి సర్వీసులు ప్రారంభం



బస్ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న డీఎం తదితరులు

ఖమ్మంమామిళ్లగూడెం: ఇటీవల ప్రారంభించిన ఇల్లెందులోని ఆర్టీసీ శాటిలైట్ డిపో నుంచి సర్వీసులు మొదలయ్యాయి. ఈ మేరకు డిపోకు చెందిన 14 బస్ సర్వీసులను కొత్తగూడెం డీఎం బి.వెంకటేశ్వర్లు ఆదివారం ప్రారంభించారు. అలాగే, డిపోకు కేటాయించిన 55 మంది ఉద్యోగులు ఆదివారం వారి డిపోల నుంచి రిలీవ్ అయ్యారు. తొలిరోజు ఇల్లెందు డిపో నుంచి ఖమ్మం, కొత్తగూడెం, గుండాల, బయ్యారం, మియాపూర్ తదితర ప్రాంతాలకు సర్వీసులు నడిచాయని డీఎం తెలిపారు.

'గుణ'నాథుడు

- వినాయక రూపంలోని ప్రతి అవయవమూ ఓ సందేశమే
- భక్తిశ్రద్ధలతో ఆచరిస్తే జీవితానికి అర్థం.. పరమార్థం..

నేడు వినాయకచవితి



ఇల్లెందులో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణపతి ప్రతిమలు

ఇల్లెందురూరల్: పల్లెలు, పట్టణాల్లో ఏటా వినాయకచవితిని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తుంటారు. బొజ్జగణపయ్య విగ్రహాన్ని పలు వీధుల్లో ప్రతిష్ఠించి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. తరువాత ఆ ఆదిదేవుడిని ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళతారు. అంతేకాకుండా ఆ లంబోదరుడిని చూసి మనమెంతో నేర్చుకోవచ్చు. మూషిక వాహనుడిలో కనిపించే ప్రతి అవయవమూ మనకు ఒక సందేశాన్నిస్తుంది. గణనాథుడి నుంచి స్ఫూర్తి పొందితే విజేతలుగా నిలిచేందుకు దారి కనిపిస్తుంది. కుంగుబాటుకు గురయ్యే వారికి ధైర్యం నూరిపోస్తుంది. ఎదిగినా ఒదిగి ఉండాలనే ఔన్నత్యాన్ని చాటి చెబుతుంది. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునేందుకు ఔషధంలా పనిచేస్తుంది. ఈ 'గుణ'నాథుడి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సన్మార్గంలో పయనించి అర్థవంతమైన జీవితాన్ని ఆచరించడమే వినాయకచవితి మనకు అందిస్తున్న గొప్ప సందేశం.

ఏకాగ్రత, సునిశిత పరిశీలన..

మనం ఏదైనా దృశ్యాన్ని చక్కగా చూడాలంటే కళ్లు దగ్గరగా చేసుకొని చిన్నవిగా చేసి చూస్తాం. అంటే అదే వస్తువు లేదా ప్రదేశంపై మనసు లగ్నం చేసుకొని ఏకగ్రాతతో పరిశీలిస్తాం. మరి వినాయకుని కళ్లు కూడా చింతకాయలా చిన్నవిగా ఉంటాయి. ఏకాగ్రత, సునిశితమైన పరిశీలనకు ఆయన కళ్లు మనకు ఆదర్శం. ఆయన కళ్ల విషయాలను నిశితంగా గమనించాలని, సూక్ష్మ గ్రాహకాలు కావాలని ఇచ్చే సందేశానికి సంకేతం.

చెవులు చాటంత..

'ఎవరైనా ఏదైనా విషయం చెప్పేటప్పుడు చెవులు చాటంత చేసుకొని విను'.. అనే మాట వాడుకలో ఉంది. గణపతి దేవుని ముందు నిల్చొని పూజ చేస్తున్నప్పుడు చాటంత చెవులు మనకు కనిపిస్తాయి. ఆయన పెద్ద చెవులు మనకెప్పుడూ గుర్తుకు రావాలి. ప్రతి విషయాన్ని వీలైనంత ఎక్కువగా విని నేర్చుకోవాలనే సందేశాన్ని ఆయన చెవుల ద్వారా మనం గ్రహించాలి.

నోరు మంచిదైతే..ఊరు మంచిదవుతుంది..

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందంటారు. వినాయకుని నోటిని చూసినా మనకు ఆ విషయం స్పష్టమవుతుంది. ఆయన చిన్న నోరును చూసి మనం తెలుసుకోవాల్సింది ఎంతో ఉంది. తక్కువగా మాట్లాడాలని, అనవసరంగా నోరు పారేసుకోవద్దని ఆ చిన్న నోరు మనకు చెప్పకనే చెపుతోంది. ఇంకా ఆ చిన్న నోటిని తొండం కప్పేసి ఉంటుంది. వివేకానికి చిహ్నంగా చెప్పుకునే తొండం ప్రతి మాట వడపోతలా బయటకు రావాలని చెపుతుంది. అందుకే ఇతరులతో మాట్లాడేటప్పుడు వినయం.. విధేయత ప్రదర్శిస్తూ అనవసరమైన మాటలు వద్దని చెబుతోంది ఆయన నోరు.

మూషిక వాహనం..

వినాయకుని ప్రతిమలో మనకు కనిపించే విచిత్రం ఆయన ప్రయాణం చేసే వాహనం ఎలుక. అంత భారీకాయుడైన విఘ్నేశ్వరుడు చిట్టి ఎలుకపై ప్రయాణం ఎలా.. అనే ధర్మసందేహం మనకు కలుగవచ్చు. కానీ మిగతా దేవతల వాహనాలతో పోలిస్తే ఎలుక అతి సామాన్యమైన వాహనం. అనవసరమైన కోరికలను అదుపులో ఉంచుకోవడం అలవర్చుకోవడం కోసం ఆ ఎలుక వాహనం మనకు మంచి విషయం చెబుతుంది. విద్యార్థి దశ నుంచే పెద్ద వాహనాలు కొనివ్వాలని అత్యధికులు తమ తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నారు. వద్దన్నా వాటిని నడిపి ప్రమాదానికి గురైన ఘటనలెన్నో నిత్యం కనిపిస్తున్నాయి. అవసరం లేకున్నా సెల్‌ఫోన్ వాడకం.. జేబు ఖర్చు.. ఇలాంటి అలవాట్ల విషయంలో మనసును అదుపులోకి పెట్టుకొని లేనిపోని ఆర్భాటాలు, కోరికలకు వెళ్లొద్దని ఈ మూషిక వాహనం మనకు చెబుతోంది.

జ్ఞానం పొందడంలో తృప్తి ఉండకూడదు

మనం నేర్చుకున్నది చాలులే అన్న తృప్తి చెందక మరింత జ్ఞానాన్ని సంపాదించడానికి ఏకదంతుని బొజ్జను చూసి అన్వయించుకోవాలి. చదివింది.. నేర్చకుంది చాలదు. ఇంకా నా కడుపు నిండలేదు అన్నట్లుగా భావించాలి. ఎంత చదివినా ఇంకా చదవాలి. ఇంకా నేర్చుకోవాలనే తపన చెప్పేదే వినాయకుడి బొజ్జ.



విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

జ్ఞానం.. ఆరోగ్యం..



గణనాథుడిగా పేరు ప్రఖ్యాతులుగాంచిన విఘ్నేశ్వరుడిని ప్రతి ఒక్కరూ ఇష్టంగా పూజిస్తుంటారు. ఆది దేవుడైన ఆయన ప్రతిరూపం వింతగా కనిపించినప్పటికీ ఆయనలోని ప్రతి అవయవం గొప్ప సందేశానికి ప్రతిరూపంగా నిలుస్తుంది. పండుగ నాడు ప్రసాదాలు ఘాటుగా, వికారాన్ని కలిగించేవిగా కాకుండా ఆరోగ్యకరమైనవిగా తయారు చేస్తారు. కేవలం ఆవిరి మీద ఉడకబెట్టిన వాటినే ప్రసాదంగా స్వీకరిస్తాడు వినాయకుడు. అదే సాత్వికమైన ఆహారం. ఇలా భక్తులకు ఆరోగ్యాన్ని కూడా ప్రసాదిస్తాడు లంబోదరుడు.

– జిల్లోజు రామాచార్యులు, అర్చక, పురోహితుల సంఘం జిల్లా కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం

సింగరేణిలో మోటార్ మెకానిక్ నియామకాలకు రాతపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న ఎనిమిది మోటార్ మెకానిక్ ట్రెయినీ కేటగిరీ–1 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి ఆదివారం రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 500 మంది దరఖాస్తు చేసుకోగా వాటిలో స్క్రూటినీ అనంతరం 419 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశారు. ఈ మేరకు కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో జరిగిన పరీక్షకు 185 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జీఎం పర్సనల్ (రిక్రూట్‌మెంట్ సెల్) కట్టా బసవయ్య పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పటిష్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ పరీక్ష నిర్వహించామని, రాతపరీక్షలో ప్రతిభ కనబర్చిన వారినే పోస్టులకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు కె.ప్రసాద్‌రావు, దీక్షితులు, ధన్‌పాల్ శ్రీనివాస్, పి.వేణుగోపాల్‌రావు, రాజేందర్‌రెడ్డి, బీవీ చలపతిరావు, డి.నాగేశ్వరరావు, కె.సంతోష్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో కొత్త మాన్యువల్



మాన్యువల్‌ను విడుదల చేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పారదర్శకత ఉండేలా సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్‌ను రూపొందించినట్లు సింగరేణి డైరెక్టర్లు ఎన్.బలరామ్, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో ఆదివారం మాన్యువల్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. గత రెండు దశాబ్దాలకు పైగా మనుగడలో ఉన్న సివిల్ కాంట్రాక్ట్ మాన్యువల్‌ను ప్రస్తుత పరిస్థితులకు రూపొందించినట్లు తెలిపారు. తద్వారా సంస్థలో సివిల్, ఇంజనీరింగ్ పనుల నిర్వహణ, ప్రతిపాదనల రూపకల్పన మరింత సమర్థవంతంగా సాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు సూర్యనారాయణ, వరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకున్న రేవంత్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన యడారి రేవంత్ సివిల్ ఇంజనీరింగ్‌లో బంగారు పతకం సాధించాడు. వరంగల్ నిట్‌లో బీటెక్ (సివిల్ ఇంజనీరింగ్)లో రేవంత్ 9.43 సీజీపీ సాధించి మొదటి ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఈ నెల 16న కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో రేవంత్‌కు గోల్డ్ మెడల్ అందించారు. ఈ సందర్భంగా రేవంత్‌ను అతడి తల్లిదండ్రులతో పాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

చర్లలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పోలీసులు ఆదివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. చర్లలో జరిగే వారాంతపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ, సుక్మా, బీజాపూర్ జిల్లాల నుంచి ఆదివాసీలు వస్తుంటారు. వీరి మాటున మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, కొరియర్లు, సానుభూతిపరులు రావొచ్చన్న అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సంతకు వచ్చివెళ్లే వారిని తనిఖీ చేసి వివరాలు ఆరా తీశారు. ఇందులో కొందరిని అదుపులోకి తీసుకోగా, విచారణ అనంతరం విడిచిపెట్టారు. చర్ల సీఐ బి.రాజగోపాల్ ఆధ్వర్యాన జరిగిన తనిఖీల్లో ఎస్‌ఐలు టీవీఆర్ సూరి, ఆర్.నర్సిరెడ్డితో పాటు సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

కేంద్రం డీ-లిస్టింగ్ చట్టం తేనుంది..

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం రానున్న రోజుల్లో డీ–లిస్టింగ్ చట్టం తీసుకురాబోతోందని ఆదివాసీ ఉద్యోగుల జాతీయ ప్రధాన కార్యదర్శి ఘన్ శ్యామ్ అలామే అన్నారు. పట్టణంలోని ఐతా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి ఆదివాసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు, మతం మారిన ఆదివాసీలకు మధ్య చిచ్చుపెట్టేలా వారికి వర్తిస్తున్న రిజర్వేషన్ రద్దు చేసే కుట్రకు బీజేపీ తెరలేపిందని ఆరోపించారు. వన్య ప్రాణుల చట్టం పేరుతో ఆదివాసీలకు వ్యతిరేకంగా నూతన చట్టాలను కేంద్రం రూపొందిస్తోందన్నారు. సమావేశంలో తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, పాయం సత్యనారాయణ, రాజేశ్ నాయక్, అజయ్‌కుమార్, లక్ష్మణ్, ప్రసాద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

బూర్గంపాడు: సారపాకలోని పెద్దమ్మతల్లి మద్యం దుకాణంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగు లు 40 కేసుల మద్యం బాటిళ్ల ను అపహరించారు. ఆరు నెలల వ్యవధిలో లక్ష్మీపురం మద్యం దుకాణంలో రెండుసార్లు, సారపాక మద్యం దుకాణంలో రెండుసార్లు చోరీ జరిగింది. శనివారం జరిగిన చోరీ ఘటనపై షాపు నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ చోరీ జరిగిన షాపు పరిసరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పామాయిల్ గెలల ట్రాక్టర్ బోల్తా

పాల్వంచ: పామాయిల్ గెలలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఆదివారం పాండురంగాపురం నుంచి పాల్వంచ వైపు పామాయిల్ గెలల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ గుంతలమయంగా మారిన కేటీపీఎస్‌రోడ్‌లోని 5వ దశ గేటు సమీపంలో బోల్తా పడింది. వర్షాలతో పాటు భారీ వాహనాలు తిరుగుతుండటంతో రోడ్డు మొత్తం దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ట్రాక్టర్ బోల్తా పడింది.

రైతులకు పశువుల పంపిణీ

పాల్వంచ: సేంద్రియ వ్యవసాయం ప్రోత్సహించాలనే లక్ష్యంతో రైతులకు ఎద్దులు, దున్నపోతులను ఉచితంగా పంపిణీ చేశారు. పాల్వంచలోని ఆదివారం జరిగిన కార్యక్రమంలో అన్నపూర్ణ గోసంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయశర్మ ఆధ్వర్యాన పలువురు రైతులకు రెండు గిత్తల చొప్పున అందించారు. మొత్తం 58 ఎద్దులు, 24 గిత్తలను రైతులకు అందజేసినట్లు శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా వధకు తరలిస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకున్న వాటిని రైతులు వినియోగించుకునేలా అందిస్తున్నామని వెల్లడించారు. అయితే, వీటిని వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించుకుంటామని రైతుల నుంచి లేఖలు తీసుకున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

కొత్తగూడెంటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను సెప్టెంబర్ నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని, వేతనాలను రూ.26 వేలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గోనెమణి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తంచేసి, విగ్రహానికే వినతి పత్రం అందించారు. అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, రజిత, ప్రమీల, పుష్ప, సరోజిని, మంజుల, నీలవేణి, సైనాబ్, వెంకటలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

చంద్రుగొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆదివారం తెల్లవారుజామున 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి తెలిపారు. కొత్తగూడెం నుంచి తిరువూరుకు బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. వాహన యజమాని తెల్ల నారాయణతోపాటు డ్రైవర్ పెదబోయిన సాయిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

అదనపు కట్నం వేధింపులతో ఆత్మహత్య

పాల్వంచ: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధిస్తుండటంతో వివాహిత పురుగులమందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని నవభారత్ గాంధీనగర్‌కు చెందిన గుగులోత్ సంతోష్‌కు మానస (27)తో ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి హర్షిత్, రుషిత్ కుమారులున్నారు. కొంతకాలంగా మానసను భర్త సంతోష్, అత్తమామలు అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తుండటంతో తాళలేక శనివారం ఇంటి వద్ద గడ్డిమందు తాగింది. ఆమెను పాల్వంచ ఏరియా ఆస్పత్రికి అక్కడి నుంచి కొత్తగూడెం, తర్వాత ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి బానోత్ సునీత ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

బూర్గంపాడు: వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన రాధికపై సారపాకలో ఆమె బంధువులు దాడి చేశారు. సారపాకకు చెందిన రాధికకు వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. రాధిక తండ్రి రెండేళ్ల కిందట మృతి చెందాడు. దీంతో రాధిక తన తల్లి వద్దనే ఉంటోంది. కాగా, సారపాకలోని వారి ఇంట్లో తమకు కూడా వాటా ఉందని రాధిక బంధువులు దాడికి దిగారు. రాధిక ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

అశ్వారావుపేటరూరల్: వేర్వేరు చోట్ల నిర్వహిస్తున్న పేకాట స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెంలోని ఓ ఇంట్లో సాగుతున్న పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.76 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, అశ్వారావుపేట శివారులోని ఓ పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, రూ.4,300 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.